క్లుప్తంగా

ఘనంగా ఆర్ట్‌అండ్‌క్రాఫ్ట్ ప్రదర్శన



తయారు చేసిన కళాకృతితో విద్యార్థి

కాగజ్‌నగర్‌టౌన్: నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో ఆర్ట్‌అండ్‌క్రాఫ్ట్ ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు అందరిని అబ్బురపరిచే విధంగా అద్భుతమైన కళా నైపుణ్యాలు ప్రదర్శించారు.స్కూల్ కరస్పాండెంట్ దోమల సురవర్ధన్, జియా ఉల్ హఖ్, దోమల మాధవి, వేద ప్రవీణ్, హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

వీర్దండిలో క్రీడా పోటీలు



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా సోమవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. టోర్నీలో మొత్తం 11 జట్లు పాల్గొన్నాయన్నారు. అనంతరం విజేతలకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్, రాజు, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ. 7 కోట్ల,14 లక్షల నిధులతో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ పూర్తయిందని, మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో జాదవ్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మండలంలోని ఉపాధి కూలీలు, అధికారులు సకాలంలో హాజరై ప్రజావేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సత్యశోధక్ సినిమాను ఆదరించాలి'

ఆదిలాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే దంపతుల జీవిత చరిత్ర ఆధారంగా తీసిన సత్యశోధక్ సినిమాను ఆదరించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బహుజనుల సంక్షేమం కోసం మహాత్మా జ్యోతిబా పూలే దంపతులు కృషి చేశారని కొనియాడారు. మరాఠీ భాషలో జనవరి 5న సత్యశోధక్ సినిమా రిలీజ్ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేటుకులే, సంఘం రాష్ట్ర కోశాధికారి సతీష్, ఉమేష్ రావు డోలే, గంగారం శేండే, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయసాధనకు కృషి చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: మహనీయుల ఆశయసాధనకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బుద్ధ విహార్‌లో నిర్వహించిన భీమా కోరేగావ్ శౌర్య దివస్ కార్యక్రమానికి హాజరయ్యారు. 1818లో జరిగిన యుద్ధంలో అమరులైన వీరులకు ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్, బౌద్ధుడి చిత్రపటాలకు పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. భీమా కోరేగావ్ యుద్ధంలో అసువులు బాసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేశ్, దుర్గం శేఖర్, మెట్టు ప్రహ్లాద్, ఆసిఫ్ పాల్గొన్నారు.

కరువు భత్యం విడుదల చేయాలి

దండేపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన కరువు భత్యం(డీఏ)ను వెంటనే విడుదల చేయాలని, తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రూప్లా నాయక్, ప్రకాశ్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు లేనిపోని ఆశలు చూపించి కాలం వెల్లదీసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏనే విడుదల చేయాలని కోరారు.



ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో..



రెబ్బెన: మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు



ఆసిఫాబాద్: న్యూలైఫ్ ఏజీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఘనంగా కొత్త సంవత్సరం వేడుకలు



రెబ్బెన: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ

దహెగాం: కొత్త సంవత్సరంలో ప్రజలందరికి మంచి జరగాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షుడు ధనుంజయ్, నాయకులు పడాల సురేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: నూతన సంవత్సరంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ఆదివారం రాత్రి వ్యాపారస్తులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ సుభాశ్, అధ్యక్షుడు రెడ్డి గోపి, జగన్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా సోమవారం భక్తులు మండల కేంద్రంలోని శివాలయంతో పాటు నెహ్రూనగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కౌటాల సీఐ సాదిక్ పాష పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే కొత్త సంవత్సర వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, నంబాలలోని ప్రసన్న పరమేశ్వర ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



సిర్పూర్(టి): పోలీస్‌స్టేషన్‌లో వేడుకలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు..

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు కోవ లక్ష్మిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ సౌందర్య, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



కెరమెరి: పూజలు చేస్తున్న భక్తులు

జీఎం కార్యాలయంలో..

గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కార్మిక సంఘాల నాయకులు జీఎం రవి ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌లు వేర్వేరుగా ఆయా కార్మిక సంఘాల నాయకులతో జీఎంను కలిశారు.

కౌటాల: మండలంలోని ప్రజలు సోమవారం నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యూ ఇయర్ సందర్భంగా కౌటాలలోని చికెన్, మటన్, చేపల సెంటర్‌లు ప్రజలతో రద్దీగా మారాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని విజయనగరం, యాపలగూడ, శివలింగపూర్, సదాశివపేట, పలు ప్రార్థన మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



కౌటాల: విజయనగరం చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



రెబ్బెన: జీఎంకు స్వీట్ తినిపిస్తున్న ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి



దహెగాం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

వైభవంగా అక్షింతల శోభాయాత్ర



జైనూర్: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కెరమెరి: చర్చిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జైనూర్: అయోధ్య శ్రీరామ జన్మభూమిలో నూతనంగా నిర్మించిన మందిరంలో శ్రీరాముల వారి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు సంబంధించిన అక్షింతలు మండల కేంద్రానికి చేరుకున్నాయని వీహెచ్‌పీ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దశరథ్ పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని జామిని గ్రామస్తులు రాంనగర్(కాలేజిగూడ) నుంచి జైనూర్ ఆంజనేయ స్వామి ఆలయం వరకు శ్రీరామ నామం స్మరిస్తూ వాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. హెచ్‌ఆర్‌సీసీ జిల్లా చైర్మన్ డోంగ్రే సమాధాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్, కమిటీ సభ్యులు కేంద్రే ప్రకాశ్, కేంద్రే పర్శరాం, కేంద్రే మారుతి, భక్తులు తదితరులు ఉన్నారు.

గుండి గ్రామంలో..

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి గ్రామంలో సోమవారం అయోధ్య మందిర పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం గుండి హనుమాన్ మందిర్‌లో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అరుణ గ్రామస్తులతో కలిసి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ శ్యామ్‌రావు, గ్రామస్తులు దత్తు, రవీందర్, శేషాద్రి పాల్గొన్నారు.

8న అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

కెరమెరి: అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలతో మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయించారు. సోమవారం మండల కేంద్రంలోని శివాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో సుమారు 1500 భక్తులతో శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేసే సందర్భంలో మండల కేంద్రంలోని శివాలయం, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు అన్ని గ్రామాల్లో ఉన్న ఆలయాలను అలంకరించడం, ప్రత్యేక పూజలు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. సర్పంచ్ న్యానేశ్వర్, అర్చకుడు బాపూదేవ్, గ్రామ పటేల్ నాగు, మోతిరాం, కమిటీ సభ్యులు శ్రీకాంత్, సుభాశ్, ప్రకాశ్, నారాయణ, వినేశ్, ఉమేశ్, గ్రామ పెద్దలు ఎల్లప్ప, ఉత్తం నాయక్, జగన్, లక్ష్మణ్, గణేశ్, స్వామి, సుదర్శన్, బాలాజి, సుధాకర్, గోపీ, కనక ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

డైరీ ఆవిష్కరణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జీఎం ఆఫీస్‌లోని చాంబర్‌లో సోమవారం ఏరియా జీఎం మనోహర్ సింగరేణి సివిల్ కాంట్రాక్టర్, ఓనర్స్ అసోసియేషన్ నూతన సంవత్సరం (2024) డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం(సివిల్) శ్రీనివాసులు, అసోసియేషన్ అధ్యక్షుడు నాగమల్లేష్, గౌరవాధ్యక్షుడు పరాందాములు, సభ్యులు ఉన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

దండేపల్లి: మండలంలోని కోయపోచగూడ గిరిజన గ్రామంలోని గిరిజనులకు మాజీ వైస్‌ఎంపీపీ రాజేందర్, పెరిక సంఘం మండల అధ్యక్షుడు గడ్డం రాంచందర్, కాసిపేటకు చెందిన కల్లెం రాజన్న కలిసి సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. గిరిజన ప్రజలకు చలి నుంచి రక్షణ కల్పించడం కోసం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సునీల్, వెంకటేష్, స్వామి, లచ్చుపటేల్, బాపు, నవీన్, శ్రీను పాల్గొన్నారు.

గూడెంలో భక్తుల సందడి

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఆంగ్ల సంవత్సరం కావడంతో భక్తులు అధికసంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. ఏడదంతా మంచి జరగాలని కోరుకున్నారు. పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు..

క్రీడలతో శరీరదారుఢ్యం పెరుగుతుంది



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దహెగాం: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు, శరీర దారుఢ్యం పెరుగుతుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని పీపీరావు కాలనీలో పాల్వాయి పురుషోత్తం రావు స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని మేకలగూడెం గ్రామంలో భీమన్న బోనాల పండుగలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా భీమా కోరేగావ్ దినోత్సవం



కౌటాలలో భీమా కోరేగావ్ దినోత్సవం నిర్వహిస్తున్న మహర్ నాయకులు



జైనూర్: విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం భీమా కోరేగావ్ శౌర్య దినోత్సవ వేడుకలను తెలంగాణ నేతకాని మహర్ మండల సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి మహర్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమా కోరేగావ్ శౌర్య విజయ స్థూపం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర మహర్ నాయకుడు, ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ మాట్లాడుతూ 1818 జనవరి 1వ తేదీన భీం కోరేగావ్‌లో సమానత్వం, ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటంలో కేవలం 500 మంది మహర్ సైనికులు 28వేల మంది విశ్వ సైనాన్ని ఓడించి విజయం సాధించారని గుర్తు చేశారు. యాపలగూడ, బోదంపల్లి, ముత్తంపేట్, గుడ్లబోరి గ్రామాల్లో శౌర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మహర్ సంఘం నాయకులు బందురావు, పాపయ్య, విశ్వనాథ్, ఆగయ్య, శంకరయ్య, నిరంజన్, దిలీప్, పత్రు, కిశోర్, జీవన్‌దాస్, విఠల్, ఏమాజీ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండల కేంద్రంలో సోమవారం భీమా కోరేగావ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బాబు కాంబ్లే, సతీశ్ గైక్వాడ్, కిరణ్ భూతాళే, వెంకటి భుతాళే, నాగోరావు కాంబ్లే, జనార్ధన్, సోన్ కాంబ్లే తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సోమవారం జైభీమ్ సేన కమిటీ ఆధ్వర్యంలో శౌర్య దివాస్, భీమ్ కోరేగావ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జై భీమ్ సేనా కమిటీ అధ్యక్షులు జాడి వినోద్ భీమ్, ప్రతినిధులు సుధాకర్, అశోక్, చరణ్, అనిల్, మనోహర్, శ్రీకాంత్, రవి, సాంబయ్య, ప్రశాంత్, పెంటయ్య, గౌతమ్, యశ్వంత్‌రావ్, పుల్లయ్య పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: సమత సొసైటీ కాగజ్‌నగర్ బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్య దివస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.

చెట్ల మాటున విద్యుత్ స్తంభాలు



తుంగమడుగులో ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకుండా పెరిగిన చెట్లు



రాస్పెల్లిలో చెట్ల కొమ్మల మధ్యలో విద్యుత్‌లైన్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాల చుట్టూ చెట్లపొదలు పెరగడంతో తరుచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మండలంలోని తుంగమడుగు, రాస్పెల్లి గ్రామాల్లోని విద్యుత్ స్తంభాల చుట్టూ ఏపుగా చెట్లు పెరిగినా అధికారులు వాటిని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. తుంగమడుగులో ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకుండా చెట్లు పెరిగినా పట్టించుకునే వారే కరువయ్యారు. రాస్పెల్లిలో పల్లె దావఖానా సమీపంలో విద్యుత్ లైను చుట్టూ చెట్లు పెరిగిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి ఏపుగా పెరిగిన చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్యవర్గం

ఆదిలాబాద్‌రూరల్: గొండ్వానా యువశక్తి.. జై మహంకాళి యూత్ మండల కమిటీని సోమవారం పందిర్‌లొద్దీ గ్రామంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్మ జంగుబాపు, ఉపాధ్యక్షుడిగా ఉయిక తుకారాం, ప్రధాన కార్యదర్శిగా తోడసం భీంరావు ఉన్నారు.